# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 174 | ఆదివారం, 24 మే 2026 | పేజీలు : 4

## కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలి



- కొన్న ధాన్యం, మొక్కజొన్నను వెంటనే మిల్లులకు తరలించాలి
- ఓపీఎంఎస్ పక్కాగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

2






## ఎండ ప్రచండం

### నిప్పులు కురిపిస్తున్న సూర్యుడు

#### పెరిగిపోయిన ఉష్ణోగ్రతలు.. పిట్టల్లా రాలుతున్న జనం

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 16 మంది మృతి
- మరో 5 రోజులు రెడ్ అలర్ట్..

**జనగామ, మన చౌరాస్తా :** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు భగ్గుమంటున్నాయి. రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గడిచిన రెండు రోజుల్లో ఏపీ, తెలంగాణలో కలిపి దాదాపు 40 మంది వడదెబ్బతో మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. మరో ఐదు రోజుల పాటు హీట్ వేవ్ కొనసాగుతుందని అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, ఎక్కువగా నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకోవాలని సూచిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సూర్యుడు ప్రచండ రూపం చూపిస్తున్నాడు. ఎండ తీవ్రతతో వడగాలులు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లోనూ వడదెబ్బ మరణాల సంఖ్య ఆందోళన కలిగిస్తుంటే.. రాబోయే రోజుల్లో ఈ సెగలు మరింత తీవ్రం కానున్నాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచి తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగభగలాడుతున్నాడు. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు తోడు తీవ్రమైన వడగాలులు తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గాలిలో తేమ శాతం పూర్తిగా పడిపోవడంతో వడదెబ్బ రూపంలో మృత్యువు ముంచుకొస్తోంది. గడిచిన రెండు రోజుల్లోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి దాదాపు 40 మంది ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తెలంగాణలోనే 30 మంది మృతి చెందారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎండల తీవ్రతకు రెండు రోజుల వ్యవధిలోనే 16 మంది వడదెబ్బతో బలి అయ్యారు. గురువారం తొమ్మిది మంది మృతి చెందగా, శుక్రవారం మరో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చిన ఒక గుర్తుతెలియని వ్యక్తి ఇప్పల్ బోరు సమీపంలో వడదెబ్బతో మృతి చెందాడు. అలాగే కాటారం మండలం రేగులగూడెంలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన భూయాన్ వినోద్ కూడా వడదెబ్బ తాకిడికి ప్రాణాలు కోల్పోయాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నిప్పుల కుంపటిలా మారడంతో వడదెబ్బ తగిలి ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. ఈ తీవ్రమైన వేడిగాలుల కారణంగా జిల్లా వ్యాప్తంగా 12 మంది వడదెబ్బతో మృతి చెందారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటగా, ఖమ్మం రూరల్ మండలం పల్లీగూడెంలో అత్యధికంగా 46.3 డిగ్రీలు నమోదైంది. పశువులు కూడా ఎండ వేడికి తాళలేక మృత్యువాత పడుతున్నాయి. మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఎండల తీవ్రతకు ఒక ఎద్దు వడదెబ్బ తగిలి మృతి చెందింది. ఇటు ఏపీలోనూ వడదెబ్బ మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. విజయవాడ నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో వడదెబ్బ కారణంగా 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతి చెందిన వారిలో ఐదుగురు రోజువారీ కూలీలు, ప్రైవేట్ ఉద్యోగులు కాగా, మిగిలిన వారిని యాచకులుగా గుర్తించారు. వన్ టౌన్ పరిధిలో ముగ్గురు, గవర్నర్ పేటలో ముగ్గురు, మాచవరం పరిధిలో ఇద్దరు, న్యూ రాజేశ్వరీ పేటలో ఒకరు, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మరణించారు. కూడళ్లలో ఉపశమన చర్యలు చేపట్టినా మరణాలు సంభవించడంతో అన్ని పోలీస్ స్టేషన్లను అధికారులు అప్రమత్తం చేశారు.

# కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలి

- కొన్న ధాన్యం, మొక్కజొన్నను వెంటనే మిల్లులకు తరలించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 1,32,459 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో ఇప్పటికే 1,23,760 మెట్రిక్ టన్నులను మిల్లులకు తరలించడం జరిగిందని, అలాగే 13,115 మంది రైతుల ఖాతాల్లోకి రూ. 233 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా 1,05,253 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేయడం జరిగిందని, మొత్తం (572) మంది హమాలీలు ఉన్నారన్నారు. మొక్కజొన్న కొనుగోలుకి సంబంధించి ఆరు కేంద్రాల ద్వారా 3,568 మంది రైతుల ద్వారా 17,499 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని, 1,6323 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలను గోదాంలకు తరలించడం జరిగిందన్నారు. జిల్లాలో కొనసాగుతున్న మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. ప్రతి మిల్లు, కేంద్రం వారీగా కొనుగోలు వివరాలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు, అలాగే మిల్లుల వద్ద ఎంత అన్లోడింగ్ పెండింగ్ ఉంది అని క్షుణ్ణంగా సమీక్షించారు. మిల్ లకు వచ్చే ధాన్యాన్ని సరిపడా హమాలీ లను పెట్టుకొని త్వరగా అన్లోడింగ్ అయ్యేలా అధికారులు పర్యవేక్షించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువస్తున్న మొక్కజొన్న, వరి ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తూకం వేసి, త్వరగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన ఓపీఎంఎస్ (OPMS) నమోదును ఎప్పటికప్పుడు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రవాణా, గోదాముల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొనుగోలు కేంద్రాల పనితీరు పట్ల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో భాస్కర్, మార్క్ఫెడ్ డీఎం చంద్రశేఖర్, డీసీఓ కోదండరాములు, డీఎంఓ రామకృష్ణ, అదనపు డీఆర్డీవో నూరుద్దీన్, పౌరసరఫరాల సంస్థ డీఎం హతిరామ్, జిల్లా మార్కెటింగ్ అధికారి రామకృష్ణ, డీసీఎస్ఓ సురేష్ రెడ్డి, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనీ, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# జనగామలో ఎమ్మెల్యే పల్లా పర్యటన

- అభివృద్ధి పనుల పరిశీలన..
- రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..
- జనగామ ఎమ్మెల్యే పల్లా

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని స్మశాన వాటికల అభివృద్ధి, రైల్వే స్టేషన్ పరిసరాల్లో జరు గుతున్న పనులను పరిశీలిస్తూ సంబంధిత అధికా రులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే పల్లా ముందుగా నెహ్రూ పార్క్ సమీపంలోని స్మశాన వాటికను సందర్శించారు. అక్కడ జరుగుతున్న సుందరీకరణ పనుల పురోగతిపై మున్సిపల్ కమిషనర్ను అడిగి తెలు సుకుని, పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే 29వ వార్డులోని స్మశాన వాటిక సమస్యపై ఎమ్మెల్యే స్పందించారు. అక్కడ స్థల లభ్యతను బట్టి ప్రజలకు ఉపయోగపడేలా పార్కు లేదా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు తెలిపారు. అనంతరం జనగామ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్లో ఉన్న ప్రయాణికులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనగామ స్టేషన్లో కొన్ని ముఖ్యమైన రైళ్లు ఆగకపోవడం, రైళ్లు సమ యానికి రాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రయాణికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పందించారు. రైళ్ల స్టాపేజీలు, సమయ పాలనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి రైల్వే జనరల్ మేనేజర్కు ప్రత్యేక వినతిపత్రం అందజేస్తానని తెలిపారు. జనగామలో మరిన్ని రైళ్ల స్టాపేజీల కోసం గట్టిగా కృషి చేస్తానని, ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



# మృతుడి కుటుంబానికి పరామర్శ

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** మండలంలోని కిష్టగూడెం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కాసోజు రమేష్ తండ్రి కాసోజు రాములు ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి, రాములు దశదినకర్మ నిమిత్తం కుటుంబసభ్యులకు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గౌరెల్లి భవానందరెడ్డి, నాయకులు ఐలోని వేణు రెడ్డి, మల్లెపూల కనకరాజు, ఎల్లబోయిన రాజశేఖర్, నీల అశోక్, మోతుల శ్రీకాంత్, ఐలోని శోభాకర్ రెడ్డి, ఐలోని సందీప్ రెడ్డి, కోమళ్ల గ్రామ బూత్ అధ్యక్షులు వల్లాల శ్రీనివాస్ మరియు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రేరణ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో డా. అగర్వాల్ వైద్య నిపుణుల చే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్య సేవల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. తి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు.కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా సమయానికి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం ద్వారా పెద్ద సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రముఖ వైద్య నిపుణులు మొత్తం 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే అవసరమైన వారికి వైద్య సలహాలు, చికిత్సకు సంబంధించిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రేరణ సర్వీస్ సొసైటీ సంస్థ చైర్మన్ చింతల సాయిబాబా, వైద్యులు శ్రీకాంత్, కరుణాకర్, డీజీఓ ప్రీతి, మేనేజర్ దయాకర్, నిర్వాహకులు మల్యాల సురేష్, చింతల గణేష్, వైద్య సిబ్బంది, సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



# హెచ్పీవీ టీకా ఆడపిల్లలకు రక్షణ కవచం

**జనగామ, మన చౌరాస్తా :** ఆడపిల్లల్లో భవిష్యత్తులో వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు 'హెచ్పీవీ' టీకా అద్భుతంగా పనిచేస్తుందని, దీనిపై తల్లిదండ్రులు ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని జనగామ ధర్మకంచ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అనురాధ, 3వ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి పిలుపునిచ్చారు. శనివారం ధర్మకంచ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక టీకాల కార్యక్రమంలో భాగంగా, మూడవ వార్డు బాలాజీ నగర్కు చెందిన 1,415 సంవత్సరాల లోపు ఆడపిల్లలను కౌన్సిలర్ బూడిద జ్యోతి స్వయంగా తీసుకువచ్చి వైద్య సిబ్బంది సమక్షంలో టీకాలు వేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనురాధ మాట్లాడుతూ దేశంలో మహిళలకు సోకే క్యాన్సర్లలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రెండవ స్థానంలో ఉందని, దీని నివారణకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ టీకా పంపిణీని ప్రారంభించిందని తెలిపారు. శాస్త్రీయంగా నిరూపితమై, పూర్తిగా సురక్షితమైన ఈ టీకాను స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు తల్లిదండ్రుల అంగీకారంతో ఉచితంగా వేస్తామని, ప్రైవేటులో వేల రూపాయలు ఖర్చయ్యే ఈ సదవకాశాన్ని సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు విధిగా ఉపయోగించుకోవాలని కౌన్సిలర్ బూడిద జ్యోతి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా శనివారం నుంచి వారం రోజుల పాటు ధర్మకంచ ఆరోగ్య కేంద్రంలో ఉచిత ప్రత్యేక ఛాతి ఎక్స్రే శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి తెలిపారు. 60 ఏళ్లు దాటిన వారు, రక్తపోటు, మధుమేహం, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, దగ్గు, ఆయాసం, ఛాతి నొప్పి, ధూమపానం, మద్యపానం అలవాటు ఉన్నవారు, గతంలో క్షయ వ్యాధి వచ్చి తగ్గినవారు, రాత్రి వేళల్లో జ్వరాలు వచ్చి బరువు తగ్గినవారు ఈ ఉచిత ఎక్స్రే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు రేవతి, స్వాతిక, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది రమేష్, దేవేంద్ర, రాజకుమారి, అనిత, లావణ్య, స్వప్న, జ్యోతి, గణేష్, ఆశా కార్యకర్తలు మరియు వార్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

